ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
7
గురువారం 16 అక్టోబరు 2025



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసిసీకేషన్)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఈనెల 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన సమయంలో కొన్ని గోల్డెన్ క్షణాలు ఉంటాయని, వాటిన వృథా చేయవద్దన్నారు. ఆ సమయంలో సీపీఆర్ చేస్తే బాధితుల ప్రాణాలను రక్షించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోందన్నారు. ప్రతి వ్యక్తికి సరైన విధానం తెలియాలన్నారు. సీపీఆర్ సమయంలో చేయవలసిన పనులు, చేయకూడని పనుల గురించి వైద్యులు డెమో ద్వారా సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల అదనపు డీఎంఈ తక్యుద్దీన్‌ఖాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, డాక్టర్ ఎనమల్ల నరేష్ పాల్గొన్నారు.

రవాణాశాఖ సర్వర్ డౌన్

- రోజంతా నిలిచిపోయిన సేవలు
- వాహనదారుల పడిగాపులు



సర్వర్ డౌన్ కారణంగా తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వాహనాదారులు, (ఇన్‌సెట్‌లో) సర్వర్ డౌన్ కారణంగా తెరుచుకొని రవాణా శాఖ వెబ్‌సైట్

తిమ్మాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ సర్వర్ డౌన్ అయింది. దీంతో బుధవారం పౌర సేవలు నిలిచిపోయాయి. మండలం కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన వాహనాదారులు ఇబ్బంది పడ్డారు. ఉదయం పని వేళలు ప్రారంభమైనప్పటి నుంచి కార్యకలాపాలు కొనసాగలేదు.రాష్ట్ర రవాణా శాఖ పరిధిలోని సిటిజన్ ఫ్రెండ్లి సర్వీస్ ట్రాన్స్‌పోర్ట్ (సీఎఫ్ ఎస్‌టీ)సర్వర్ మొరాయించింది. ఆర్టీఏ వెబ్ సైట్‌లో వివరాలు కనిపించక స్లాట్ బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి కార్యకలాపాలు నిలిచిపోవడంతో జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద వాహనదారులతో వేచి చూశారు. వాహనాదారులు గంటల తరబడి క్యూలో నిలుచున్నారు. సాంకేతిక సమస్యతో సర్వర్ డౌన్ అయ్యిందని రవాణా శాఖ అధికారులు వారికి తెలిపారు. మధ్యాహ్నం వరకు సర్వర్ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో బుధవారం వచ్చిన వారు తిరిగి గురువారం రావాలని, వారు కార్యాలయంలో ఇచ్చిన డాక్యు మెంట్లను తిరిగి ఇచ్చేశారు.

- **కొనసాగిన సారథి సేవలు**

కేంద్రం ప్రభుత్వం నిర్వహించే సారథి వెబ్‌సైట్ సేవలు యథావిధిగా కొనసాగాయి. సారథి పోర్టల్ ద్వారా కొత్త డ్రైవింగ్ లైసెన్స్, లైసెన్స్ రెన్యూవల్, లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేశారు. సాయంత్రం పనివేళలు ముగిసే వరకు కూడా సర్వర్ అందుబాటులోకి రాలేదు.

- **రాష్ట్రం వ్యాప్తంగా ఆర్టీఏ సేవలు నిలిచిపోయాయి**

- పురుషోత్తం, డీటీసీ

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ సేవలు బుధవారం నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యలతో సర్వర్ డౌన్ అయ్యింది. వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దు..బుధవారం స్లాట్ బుక్ చేసుకున్న వారికి గురువారం అవకాశం కల్పిస్తాం. ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

పదేళ్ల సేవలకు గుర్తింపు ఏది?

- ఖాళీల భర్తీతో అర్థాంతరంగా తొలగింపు
- పెండింగ్‌లో నాలుగు నెలల గౌరవ వేతనం
- ఇబ్బందుల్లో గెస్ట్ లెక్చరర్లు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అరకొర వేతనాలతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పదేళ్లపాటు సేవలందించి అతిథి(గెస్ట్) లెక్చరర్లుగా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉన్నఫలంగా వారిని తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జూనియర్ కళాశాలల్లోని లెక్చరర్ల పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేశారు. పీజీతోపాటు అనుభవం కలిగిన నిరుద్యోగ యువకులతోపాటు పదవీ విరమణ పొందిన లెక్చరర్లకు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసే అవకాశం కల్పించారు. ఒక నెలలో ఒక్కో గెస్ట్ లెక్చరర్ 72 పీరియడ్స్‌లో విద్యాబోధన చేస్తే 6,500 చొప్పున గౌరవ వేతనం చెల్లించింది. ఆ సమయంలో చాలా మంది రిటైర్డు లెక్చరర్లు ఈ పోస్టుల్లో నియమితులయ్యారు. వారి వయసురీత్యా అనుకున్న మేరకు ఫలితాలు రావడం లేదని గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో త్రీమెన్ కమిటీ ద్వారా గెస్ట్ లెక్చరర్లను నియమించే ప్రక్రియకు శ్రీకారం చుట్టి వారి గౌరవ వేతనాన్ని 21 వేల రూపాయలకు పెంచింది. పీజీ అర్హతతోపాటు అనుభవాన్ని బట్టి గెస్ట్ లెక్చరర్లను నియమించారు. దీంతో అనేక మంది పీజీ అర్హత కలిగిన నిరుద్యోగులకు గెస్ట్‌లెక్చరర్ పదవులు లభించాయి. పదేళ్లుగా జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ఏరోజైనా గుర్తింపు ఇస్తారని గెస్ట్ లెక్చరర్లు ఆశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన కొంత మంది కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను రద్దు చేసి టీజీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్ల పోస్టులను భర్తీ చేసింది. దీంతో జిల్లాలో పదేళ్లపాటు గెస్ట్‌లెక్చరర్‌గా పనిచేసిన 22 మందిని తొలగించారు. వీరందరికి డిసెంబరు 2024 నుంచి మార్చి 2025 వరకు నాలుగు నెలల గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

- **ఖాళీ పోస్టుల్లోనైనా సర్దుబాటు చేయండని వేడుకోలు**

అరకొర వేతనాలతో జీవితం గడుపుతున్న గెస్ట్ లెక్చరర్లంతా నిరుద్యోగులుగా మారిపోయారు. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ బోర్డులోని ఖాళీలోనైనా తమను సర్దుబాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గురుకులాలు, మోడల్ స్కూల్‌లో ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉన్నందున జూనియర్ కళాశాల్లోకూడా విద్యార్థుల సంఖ్యను బట్టి 1,654 మంది అతిథి అధ్యాపకులను భర్తీ చేసుకునేందుకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఆర్థికశాఖకు ప్రతిపాదనలను పంపించింది. ఆర్థికశాఖ 398 మందికి మాత్రమే అనుమతినిచ్చింది. మరోసారి బోర్డు ఆఫ్ ఇంటర్మీ డియట్ కార్యదర్శి మరో 494 పోస్టులకు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదనలను పంపించారు. 1,654 పోస్టులకు అనుమతి వచ్చే అవకాశం లేకపోవడంతో కనీసం (మిగతా 10వ పేజీలో)

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

- 48 నుంచి 72 గంటల వ్యవధిలో ధాన్యం సొమ్ము, బోనస్ జమ చేయాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం మంత్రి హైదరాబాద్ నుంచి వానకాలం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. స్వతంత్ర ధాన్యం రవాణా కాంట్రాక్టు ఖరారు చేసి సరిపడా వాహనాల సరఫరా చేసేందుకు అర్హత ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభించి, అవసరమైన మేరకు టార్పాలిన్ కవర్లు, గోనె సంచులు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకోవాలన్నారు కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురు చూసే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. కొనుగోళ్ల వేగవంతం చేసేందుకు జిల్లాస్థాయిలో అవసరమైతే మిల్లర్లకు కొంత మి సహాయింపు ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని, ఇందుకు సరిపడా సిబ్బందిని నియమించు కోవాలన్నారు. 48 నుంచి 72 గంట ల్లోపు రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు, బోనస్ జమచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

వ్యవసాయశాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కొనుగోలు కేంద్రాలను వరి కోతలకు ముందే ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కలెక్టర్లకు సూచించారు. ధాన్యం కొనుగోళ్ల క్రమపద్ధతిలో జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు.

కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో ఈ వాన కాలంలో 2.75 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేసి, 325 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొనుగోళ్లకు సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ అధికారి నర్సింగారావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పట్టుదల, ప్రతిభతో విజయం సాధించాలి

- జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): బాలికలు పట్టుదల, ప్రతిభ, నైపుణ్యం తో విద్యనభ్యసించి అన్నిరంగాల్లో విజయం సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివితే విజయం సాధించ వచ్చని సూచించారు. విద్యతో పా టు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుడుగు వేయాలని సూచించారు. కష్టపడి ఇష్టంతో చదవా లని అన్నారు. బాలికల అందం వారి నైపుణ్యం, తెలివితేటలు, ధైర్య సాహసాల్లో ఉంటుందని తెలిపారు. అందువల్లే వినూ త్నంగా మిస్ కరీంనగర్ పోటీలు నిర్వహించా మని, ఈ పోటీలకు నైపుణ్యం, తెలివితేటలు ప్రామాణికంగా తీసుకున్నామని చెప్పారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లా డుతూ జిల్లా యంత్రాంగం ప్రభుత్వ పాఠశాల ల్లో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా జడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల, ప్ర భుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన బాలిక లకు మిస్ కరీంనగర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ పమేలాసత్పతి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, మెమెం టోలను ప్రదానం చేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్క రించుకొని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలె క్టర్ పమేలా సత్పతి ఆలపించిన ఓ చిన్ని పిచ్చుక... చిన్నారి పిచ్చుక పాట వీడియోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ రాంబాబు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



యోగాసనం వేస్తున్న చిన్నారులు

మిగిలింది మూడు రోజులే..

- 20 రోజుల్లో వచ్చింది 233 దరఖాస్తులే...

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునేం దు కు మూడు రోజుల సమయమే మిగి లింది. ఒక వైపున సమయం దగ్గర పడుతుం డడం... మరో వైపున దరఖా స్తులు ఆశిం చిన స్థాయిలో రాకపోవడంతో ఎక్సైజ్ అధికా రుల్లో టెన్షన్ నెలకొంది. గత ఎక్సైజ్ సంవత్సరం (2023)లో నిర్వహించిన మద్యం టెండర్లలో వచ్చిన దరఖాస్తులకంటే 50 శాతం అధికంగా దరఖాస్తులు రావాలని ఎక్సైజ్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో 94 వైన్‌షాపులకు లైసెన్స్‌ల జారీకి సెప్టెంబరు 26న నోటిఫి కేషన్ జారీ అయింది. 20 రోజులు గడిచినా ఇంత వరకు 233 దరఖాస్తులు మా త్రమే అం దాయి. 2023లో 4,040 దరఖాస్తులు వచ్చాయి. ఫీజును మూడు లక్షలకు పెంచడం తోనే దరఖా స్తులు తక్కువ సంఖ్యలో వస్తున్నాయను కుంటున్నారు.

- **చివరి రోజులపై ఆశలు**

2019-21 ఎక్సైజ్ సంవత్సరంలో 87 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 1,375 దరఖాస్తులురాగా ఇందులో చివరి మూడు రోజుల్లోనే 1,200 దరఖాస్తులు వచ్చాయి. 2021-23 ఎక్సైజ్ సంవత్సరంలో 94 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 1,720 దరఖాస్తులురాగా ఇందులో చివరి మూడు రోజుల్లోనే 1,577 దరఖాస్తులు వచ్చాయి. 2023-25 ఎక్సైజ్ సంవత్సరంలో 94 వైన్‌షాపులకు దరఖాస్తులను ఆహ్వానించగా మొత్తం 4,040 దరఖాస్తులురాగా ఇందులో చివరి రోజునే రికార్డుస్థాయిలో 2,097 దరఖాస్తులు వచ్చాయి. అర్ధరాత్రి వరకు దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం కూడా ఇదే విధంగా దరఖాస్తులు చివరి మూడు రోజుల్లోనే వెల్లువెత్తే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.



- **సిండికేట్ల చేతుల్లోనే మద్యం దుకాణాలు**

రెండు దశాబ్దాలుగా జిల్లాలోని వైన్ షాపులు, బార్లు బడా మద్యం వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న సిండికేట్ల చేతుల్లోనే ఉన్నాయి. దీంతో వైన్‌షాపుల లైసెన్స్‌ల కోసం ఇతరులు దరఖాస్తులు చేస్తున్నప్పటికీ వారికి లైసెన్స్‌లు దక్కకుండా పాత వ్యాపారు లంతా సిండికేట్‌గా మారి ఒక్కో గ్రూపు నుంచి 100 నుంచి 200 వరకు దరఖాస్తులు వేస్తారు. ఒక్కో షాపునకు 10కి పైగా దరఖాస్తులు చేస్తున్నారు. దీంతో కొత్తవారికి అవకాశం రావడం లేదు. పాత వ్యాపారులే దశాబ్దాల కాలంగా జిల్లాలో మద్యం వ్యాపారాన్ని ఏలు తున్నారు. కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చినవారిని ఈ సిండికేట్లట చేరాల్సిన పరిస్థితులు కలిపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు వివిధ రంగాల వ్యాపారులు, ఉద్యోగులు, ఇతరులకు గ్రూపుల వారిగా వాట్సప్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ అంతగా స్పందన కనిపించడం లేదు.

వరి కోతలు ప్రారంభం

దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

హుజూరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతాయనే ఉద్దేశ్యంతో రైతులు కాస్త ముందుగానే వరి కోతలను మొదలు పెట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కోసిన వరి ధాన్యాన్ని రైతులు రోడ్లపై, కల్లాల్లో ఆరబోస్తున్నారు. కొంత మంది రైతులు అవసరాల నిమిత్తం దళారులకు విక్రయించుకుంటున్నారు. ఈ వానాకాలంలో ఆశించిన మేర మొదట్లో వర్షాలు కురియ లేదు. రైతులు బావులు, బోర్లలో ఉన్న నీటితో వరి నాట్లు వేశారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాల్ మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి 2,389, సాధారణ రకానికి 2,369 రూపాయలుగా ధరలు నిర్ణయించింది. డివిజన్‌లో హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, సైదాపూర్, శంకరపట్నం మండలాలు ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల్లో సాగు భూమి ఉంది. అందులో 80వేల ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో పత్తి, 15వేల ఎకరాల్లో మొక్కజొన్న, కూరగాయలు ఇతర పంట లను సాగు చేస్తున్నారు. డివిజన్‌లో సుమారు 50వేల ఎకరాల్లో రైతులు సన్న రకాలు సాగు చేశారు. ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



హుజూరాబాద్ సమీపంలో వరి కోస్తున్న హార్వెస్టర్



ఆరబోసిన వరిధాన్యం

20 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 20 నుంచి 31 వరకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీపీ గౌస్‌ఆలం ఓ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ఎందరో పోలీసు అధికారులు, సిబ్బంది తమ ప్రాణాలను కోల్పోయారని, వారి త్యాగం వలనే నేడు ప్రజలు ప్రశాం తంగా జీవిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవడంలో భాగంగా 12 రోజులపాటు పోలీస్ కమిషన రేటులోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌తో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు. ప్రజ లందరూ ఈ సంస్మరణ వారోత్సవాలలో పాల్గొని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ జీవితాలను అంకితం చేసిన అమరవీరులకు నివాళుల ర్పించాలని కోరారు.



పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

- **నిర్వహించే కార్యక్రమాలు...**

అక్టోబరు 20న బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల పోస్టర్ల ప్రదర్శన, 21న అమరవీరుల దినోత్సవ కవాతు, అమరుల కుటుంబ సభ్యులకు సన్మానం, బహుమతుల ప్రదానం ఉంటుందని సీపీ తెలిపారు. 22న పోలీసు ప్రధాన కార్యాలయంలో రెండు విభాగాల్లో పోలీసు అధికారులకు వ్యాస రచన పోటీ, విద్యార్థులు, ప్రజలకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. షార్ట్ ఫిల్మ్‌లు, ఫొటోగ్రఫీ పోటీ కోసం ఆన్‌లైన్ లింక్‌ను ప్రారంభించనున్నట్లు సీపీ తెలిపారు. 3న పోలీసు ప్రధాన కార్యాలయంలో విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం, ఆయుధాల ప్రదర్శన, షీ టీమ్ అవగాహన, ట్రాఫిక్ నియమాలపై అవగాహన, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 24న మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ, 25న ప్రజలతో కలిసి పోలీసుల సైకిల్ ర్యాలీ, 26న పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులను కలవడం, వారి సంక్షేమం గురించి తెలుసుకుంటామన్నారు. పోలీసు అమర వీరుల విగ్రహాలకు నివాళులు అర్పించను న్నట్లు తెలిపారు. 27న హుజూరాబాద్ డివిజన్ పోలీసులతో విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. ఆయుధాల ప్రదర్శన, షీ టీమ్, ట్రాఫిక్ నియమాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థుల పోలీస్ స్టేషన్లు సందర్శన, కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉంటుందన్నారు. 28న పోలీసు అమరవీరుల త్యాగాలు, ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, వ్యాస రచన పోటీ, షార్ట్ ఫిల్మ్‌లు, ఫోటోగ్రఫీ పోటీల కోసం విద్యార్థులు, ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 29న పోలీసు ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు. 30న ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విజేతలకు (వ్యాస పోటీ, షార్ట్ ఫిల్మ్‌లు, పోలీసులకు సంబంధించిన ఫోటోలు) బహుమతి పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. 31న పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని సీపీ గౌస్ ఆలం తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● గర్షకుర్తి విష ప్రయోగం ఘటనలో ఇప్పటికే భర్త మృతి



లక్ష్మీ (ఫైల్)

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో వృద్ధ దంపతులపై విష ప్రయోగంలో ఇప్పటికే భర్త మృతి చెంద గా భార్య తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. గర్షకుర్తిలో ఈ నెల 7న గజ్జల శంకరయ్య అతని భార్య లక్ష్మీలకు అదే గ్రామానికి చెందిన కత్తి శివ మత్తు గుళికలు ఇవ్వ డంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుం డగా శంకరయ్యకు పరిస్థితి విషమించి ఈనెల 8న మృతిచెందాడు. అప్పటి నుం చి కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీ బుధవారం తుది శ్వాస విడిచింది. వృద్ధ దంపతులపై విషప్రయోగం జిల్లా లో కలకలం రేపింది. గంగాధర ఎస్సై కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడు కత్తి శివను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నగదు, బంగారం స్వా ధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం పెద్దపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన వెలిచాల రమేష్(55) కూనారం రోడ్డులో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న నిచ్చెనను రెండో అంతస్తుకకు తీసుకెళ్తుండగా నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రమేష్ అక్కక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన ఆర్మూర్ వాసి మృతదేహం

మల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన జోరిగే గంగాధర్(35) అనే వ్యక్తి మృతదేహం బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో గుర్తించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగే గంగాధర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా నష్టపోయిన గంగాధర్ అప్పు ఎక్కువడంతో ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 10న సోన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కొత్తధాం రాజుపల్లి శివారులోని గోదావరి నదిలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా భార్య మౌనిక మృతదేహం పరిశీలించి భర్త జోరిగే గంగాధర్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి అనుమానాస్పద మృతి

- స్వగ్రామానికి చేరిన మృతదేహం



తేజ (ఫైల్)

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పిట్ల తేజ(24) అనే యువకుడు ఇటీవల గల్ఫ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందగా, బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధి నిమిత్తం 8 నెలల క్రితం తేజ రూ.లక్షకు పైగా అప్పు చేసి దూబాయికి వెళ్లాడు. అక్కడ పనిసరిగా లేక ఇబ్బందులు పడ్డ తేజ ఆగస్టు 29న ఇండియాకు వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఇండియాకు వచ్చే క్రమంలో అనుహ్యంగా దుబాయిలో తప్పిపోయి, మరుసటి రోజు రూంకు వచ్చాడు. తేజ ఒంటిపై గాయాలు ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి తిరిగి సెప్టెంబరు 3న తన రూం వచ్చాడు. తెల్లారేసరికి తేజ మళ్లీ రూంలో కన్పించకపోవడం, సెప్టెంబరు 19న పోలీస్‌లకు శవమై కన్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తేజ మరణవార్త సెపెంబరు 23న వారి బంధువులకు తెలిసింది. 27 రోజులకు తేజ మృతదేహం స్వగ్రామమైన నాగంపేటకు వచ్చింది. మృతుడికి తల్లిదండ్రులు లత, రాజేష్, తమ్ముడు గౌతమ్ ఉన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



శంకరయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు భరించలేక మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ చాట్ల శంకరయ్య(55) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని శంకరయ్య వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. మనస్థాపం చెందిన శంకరయ్య ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు నర్సింలు, సురేందర్, కూతురు శిరీష, తల్లి లక్ష్మి ఉన్నారు.

జాడ లేని చేప పిల్లలు



● సమయం మించిపోతున్నా పట్టించుకోని పాలకులు.. అధికారులు

● ఆలస్యమైతే ఎదగడం కష్టం...

ఇల్లందకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాడును ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా చెస్తేనే చెరువులు నిండే వరకు చేపపిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

ఉసేలేని టెండర్లు...

గతంలో చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలోనే జరిగేది. కాంట్రాక్టర్లు సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను మండలాలకు చేప పిల్లలు చేర్చి చెరువుల్లో వదిలేవారు. దీంతో చేప పిల్లల ఎదుగుదల బాగుండేది.

అదను దాటితే అంతే సంగతులు...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువులో వదిలితే వాటి ఎదుగుదల సరిగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు నెల చివరి లోపే చేప పిల్లల పెంపకాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. అప్పుడే చేప పిల్లల ఉత్పత్తి బాగుంటుంది. లేదంటే ఏ రకమైన చేప అయినా సరే బరువు అంతంతగా పెరుగుతుంది. ప్రభుత్వం చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఆలస్యమైతే ఎదగడం కష్టం..

యామ శ్రీనివాస్, మత్స్యకారుడు, టేకుర్తి



చేప పిల్లలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేస్తే వాటి ఎదుగుదల కష్టంగా ఉంటుంది. ప్రతి ఏటా చేపలను పట్టుకొని అమ్మడం వల్ల కొంత ఉపాధి దొరికేది. రెండేళ్లుగా చేప పిల్లల పంపిణీ లేక ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికే సమయం దాటి పోయింది. ఈ నెలాఖరు వరకైనా పంపిణీ చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

పుట్ట రాజు, మత్స్యకారుడు, వాగొడ్డురామన్నపల్లి



గ్రామాల్లోని చెరువుల్లోకి చేపల పిల్లల పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చెరువుల్లో చేపలను పంపిణీ చేయాలి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాల, తక్కళ్లపల్లి, బొమ్మెన పెద్దవాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను బుధవారం రెవెన్యూ అధికా రులు పట్టుకున్నారు. ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతిలో' ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు.. అనుమతులకు అధికారుల నిరా కరణ అనే శీర్షికన ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. ఏకకా లంలో మూడు బృందాలు దాడులు చేసి అక్రమంగా వాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్ రూరల్‌లో..

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండ లం వల్లంపహాడ్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కోరుట్ల రూరల్, 15 (ఆంధ్రజ్యోతి) పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ..కోరుట్ల రూరల్ మండంలోని మాదాపూర్ శివారు, రామారావుపల్లె శివారులో వేర్వేరుగా రెండు గ్రూపులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా సీసీఎస్, కోరుట్ల పోలీసులు దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. మాదాపూర్ శివారులోని గ్రూపులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12150లు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. రామారావు పల్లె శివారులో పేకాట ఆడుతున్న మరో గ్రూపు నుంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీకుకోగా వారి వద్ద నుంచి రూ, 5100లు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

25 నుంచి యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు సంఘం నగర కార్యదర్శి అల్లపు అభిలాష్ తెలిపారు. బుధవారం ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించ నున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యలపై చేపట్టనున్న కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మణితేజ, అభిలాష్, ఉమామహేశ్వర్, రాకేష్, సాయి కుమార్ పాల్గొన్నారు.

కళాశాల మైదానంలో

అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దు

జమ్మికుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల మైదానం విస్తీర్ణం 20ఎకరాలు ఉండేదని, ప్రస్తుతం 8 ఎకరాలకు వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. అథ్లెటిక్స్ స్టేడియం వస్తే వాకింగ్ చేసేవారికి, ఆడుకునే పిల్లలకు భంగం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. కబ్జాకు గురైన ఇండ్లను కూల్చేసి స్టేడియం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సాయిరాం, వెంకటేష్, సజ్జద్, రత్నాకర్, సుధీర్, రాజేష్, విష్ణు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు చెల్లించడం లేదని ఇంటికి తాళం

- గర్జనపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన బాకీ డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న పాపానికి ఇంటిలో నుంచి కుటుంబ సభ్యులను బలవంతంగా బయటకు గెంటేసి తాళం వేసిన సంఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. అప్పు ఇచ్చిన వ్యక్తి తమను మానసికంగా వేధించడంతో పాటు ఇంటికి తాళం వేశారని పేర్కొంటూ బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని అబ్రహం అదే గ్రామానికి చెందిన నరేశ్ వద్ద రూ.2.50 లక్షల అప్పు తీసుకున్నాడు. అందుకు అతని సోదరుడు బాబు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ప్రతినెలా వడ్డీ కింద అబ్రహం రూ.25 వేలు చెల్లించేవాడు. మూడు నెలల నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో అబ్రహంను బాకీ ఇచ్చిన వ్యక్తి నరేశ్ అడిగాడు. పరిస్థితి బాగులేదని విన్నవించుకున్న ఆయన పట్టించుకోలేదు. మధ్యవర్తిగా ఉన్న బాబు ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ఇంటికి తాళం వేస్తానని తేల్చిచెప్పాడు. కొంత గడువు ఇస్తే బాకీ డబ్బులు ఇప్పించేలా చూస్తానని ప్రాధేయపడినా వినిపించుకోకుండా బాబు ఇంటికి నరేశ్ తాళంవేశాడు. దాంతో బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన రేణికుంట బాబు(34) అనే యువకుడు మోటారు సైకిల్‌పై మానకొండూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. గంగిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తుండగా లలితాపూర్ బస్టాండ్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో ఒకరికి మూడు సంవత్సరాల జైలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో ఎర్ర అక్షయ్‌కుమార్(21)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దొంతాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కళావతి భర్త మృతి చెందిన తరువాత తన పెద్ద కొడుకు అక్షయ్‌కుమార్ డబ్బులు అడుగుతూ తరచుగా గొడవలు పెట్టాడు. తల్లి, తమ్ముళ్లపై దాడికి పాల్పడడంతో అతడి బాధలు భరించలేక కళావతి తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. 2020 అక్టోబరు 4న రాత్రి అక్షయ్‌కుమార్ తన స్నేహితులను తీసుకువచ్చి తల్లిని, తమ్ముళ్లు సంజయ్‌కుమార్, ఉదయ్ కుమార్‌లపై దాడి చేశాడు. కళావతి అన్న దాసరి కిషన్ అడ్డుగా వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాడు. కొడుకు అక్షయ్‌కుమార్ వల్ల తనకు ప్రాణ భయం ఉందని బాధితురాలు కళావతి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు ఎర్ర అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పీపీ రాజేష్, ఇన్వెస్టిగేషన్ ఎస్ఐలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు పీసీ మహేష్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దెబ్బతిన్న బారికేడ్లు



వై జంక్షన్ సమీపంలో పక్కన పడి ఉన్న బారికేడ్



దిగువ కొండగట్టు ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దెబ్బతిన్న బారికేడ్

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్లపై నిర్లక్ష్యం అలుముకుంది. ఏడేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో సుమారు 67మంది మృతి చెందడంతో ప్రభుత్వం ఈ ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేసింది. తరువాత కొన్నాళ్లకు షరతులతో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వగా భారీ వాహనాలను పూర్తిగా నిషేధించింది. ఇందులో భాగంగా దిగువ కొండగట్టు వద్ద ఘాట్‌రోడ్డు ప్రారంభంలో, ఘాట్‌రోడ్డు చివరలో కొండపై వైజంక్షన్ వద్ద రెండు భారీ వాహనాల రాకపోకలు ఉండకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొండపై వైజంక్షన్ వద్ద గల బారికేడు పూర్తిగా కూలిపోవడంతో పక్కన పడేశారు. కొండ కింది బారికేడు వాహనాలు ఢీకొని దెబ్బతిన్నది. భారీ వాహనాలు బారికేడు కింద నుంచి వెళ్లాలనే ప్రయత్నంలో బారికేడ్లు దెబ్బతిని ధ్వంసం అవుతుండగా పట్టించుకునే వారే లేకపోవడంతో భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ప్రమాదానికి ముందు ఏర్పాటు చేసినవి ఇలాగే పడిపోవడం, మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో బస్సు ప్రమాదంతో పాటు అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డ సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా బారికేడు కూలిపోవడంతో అడ్డు కనిపించక బారీ వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బీసీ సంఘాల బంద్‌ను విజయవంతం చేయాలి



బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘాల, కుల సంఘాల నాయకులతో బుధవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, నారోజు రాకేష్ చారి, కోడూరి పర్శరామ్ గౌడ్, నర్సింగోజు శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మాచర్ల అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి

భగత్‌నగర్ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన కోసం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని అమోదించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

అయినవారు దూరమై అనాథగా బాలుడు

● మూడు రోజుల క్రితం తండ్రి, గతంలో తల్లి మృతి



స్వాద్విన్ కుమార్

చొప్పదండి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ స్వాద్విన్‌కుమార్ తల్లిదండ్రులు కోల్పోవడంతో అనాథగా మారాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న స్వాద్విన్ కుమార్ తండ్రి దీకొండ అశోక్ గత ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. మూడు సంవత్సరాల క్రితం తల్లి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించింది. తల్లి మరణించిన తరువాత అన్ని తానై పెంచిన తండ్రి కూడా మరణించ డంతో స్వాద్విన్ కుమార్ ఒంటరిగా మిగిలాడు. తాత,నానమ్మలు కూడా గతంలో మరణించగా బాలుడి పరిస్థితి దిక్కులేని వాడు అయ్యాడని గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పిన ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి సుల్తానాబాద్ వైపు వస్తున్న పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన దేవోజు లక్ష్మీనరసింహచారి(52) మండలంలోని కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కల్వచర్లలో చోరీ.. పోలీసుల తనిఖీలు



కల్వచర్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలోని సౌమిత్రి లావణ్య పాతగృహంలో చోరీ జరిగింది. శివాలయం వెనకల గల పాత ఇంటిలో స్టోర్ చేసిన ఇత్తడి, రాగి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఉదయం పాత ఇంటిలోకి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితురాలు పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా ఎస్ఐలు శ్రీనివాస్, దివ్య ఆధ్వర్యంలో పోలీస్‌లు ఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

● మార్కెట్‌లో జేబుదొంగతనం

మండలంలోని సెంటినరీకాలనీలోని సంతలో బుధవారం జేబుదొంగతనం చేస్తూ పట్టిబడిన ఇద్దరిని వ్యాపారస్తులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అగ్నిప్రమాదం

వేములవాడ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్(ఇన్‌కేబుల్) నెట్‌వర్క్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మెయిన్ బోర్డులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షార్ట్‌సర్క్యూట్ ప్రభావంతో కార్యాలయంలోని దాదాపు రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, ఇతర కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ కేబుల్ నెట్‌వర్క్ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా వెంటనే యజమాని కొలిపాక నర్సయ్య ప్రత్యామాయ ఏర్పాటు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నష్టం అంచనా వేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ గ్రామానికి చెందిన రాజేష్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా గుర్తించిన పోలీసులు బుధవారం అతడికి అప్పగించారు. 2023 నవంబరు 22న బొమ్మకల్‌లో సెల్‌ఫోన్ పోగొటుకున్న రాజేష్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నిలజీతో ఫోన్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాజేష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటకు చెందిన లకిడి వీణరాణి ఇటీవల తన వివో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీస్‌లు వెంటనే ఐఎమ్ఈఐ నెంబర్ ద్వారా మొబైల్‌ను పట్టుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ నాగరాజు మహిళకు ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. బుధవారం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పిస్తారని, మూడు సంవత్సరాలు ఈ ఒప్పందం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలే అవగాహన ఒప్పందం లక్ష్యమన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, డాక్టర్ హరికాంత్ పాల్గొన్నారు.

'రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు'..



శంకరపట్నం మండలంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

శంకరపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు వరి ధాన్యం ఆరబోయడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని రైతులు దారుల వెంట వరిధాన్యం ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కొన్ని గ్రామాల్లో రైతులు తమ వరి పంటను రహదారులపై ఆరబెట్టడం గమనించినట్లు తెలిపారు. వాహనదారులు జారిపడడం, ప్రమాదాలు జరగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రహదారులు ప్రజా వినియోగానికి చెందినవని, వాటిపై వస్తువులు, పంట ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే శిక్షార్హులు అవుతారన్నారు. రైతు సోదరులు తమ పంటలను రహదారులపై కాకుండా గ్రామాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కూరగాయాల సాగు..

● అనుకూలించని పరిస్థితులు.. ఆందోళనలో కూరగాయల రైతులు ● పెరిగిన పెట్టుబడులతో నష్టాలు.. ● రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు



రహీంఖాన్‌పేట గ్రామంలో సాగవుతున్న టమాట

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుకూలించని వాతావరణ పరిస్థితులతో కూరగాయల రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల సాగు ఒడిదొడుకులతో కూడుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం మండలంలో సాగువిస్తీర్ణం పెరుగుతోంది. చిన్న కమతాలు, నీటి సౌలభ్యం బాగాలేని రైతులు కూరగాయల సాగుకు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు. పెట్టుబడులు పెట్టి ఆదాయం కోసం ఎక్కువ కాలం వేచి ఉండని రైతులు సైతం కూరగాయ పంటలను సాగుచేస్తుంటారు. మండలంలోని రహీంఖాన్‌పేట, రామోజిపేట, తిప్పాపూర్, పొత్తూరు, దాచారం, వల్లంపట్ల తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా కూరగాయల పంటలను సాగుచేస్తుంటారు. మండలంలో గత వానాకాలంలో 75ఎకరాల విస్తీర్ణంలో కూరగాయ పంటలను సాగుచేయగా ఈసారి అధికారుల లెక్కల ప్రకారం 90ఎకరాలు సాగుచేస్తున్నారు. దీనికి తోడు మరికొన్ని గ్రామాల్లోను కూరగాయలను సాగుచేస్తున్నారు. ఎక్కువగా టమాట, మిరప, కాకర, బీరకాయ, పచ్చిమిర్చి, కీరదోస



బీరతోటను పరిశీలిస్తున్న డివిజన్ హార్టికల్చర్ అధికారి

పంటలను సాగుచేయడానికి రైతులు మొగ్గు చూపుతుంటారు. వరుసగా కురిసిన వర్షాలతో పంటలను తీవ్ర నష్టం జరిగింది. దీనికి తోడు సరైన ధరలు లేకలేకపోవడంతో పెట్టుబడులు వచ్చేలా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25కిలోల టమాట బాక్స్ ధర ప్రస్తుతం రూ 400 వరకు రైతులు అమ్ముతున్నారు. టమాటాలను తెంపడానికే ఒక కూలీకి రోజుకు రూ 350 చెల్లిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కంటే చేలకు తెగుళ్లు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం కూరగాయల రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం లేక..

కూరగాయలను పండించిన రైతులకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలను తెంపిన అనంతరం ఆటలో సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్‌కు తరలించడానికి ఆటో కిరాయి తీసుకొని పోతుంటారు.

కొన్నికొన్ని సందర్భాలలో ఆటో కిరాయిలు, రైతుకు కూలీ కూడా పడటం లేదని పేర్కొంటున్నారు. స్వంత ఆటో ఉన్న రైతులు హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో వారు కొంత లాభపడుతున్నారు. రైతులు తక్కువ పండిన రైతులు పారబోయడానికి ఇష్టపడక వారసంతలలో అమ్ముతూ నష్టాలు పూడ్చుకుంటున్నారు. ఒకప్పుడు లాభసాటిగా ఉన్న కూరగాయల సాగు తరచూ వర్షాలు పడుతుండటం వల్ల కోలుకోలేని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది

అవారి బాబు, కూరగాయల రైతు, తిప్పాపూర్



తరచూ వర్షాలు పడటంతో పాటు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేకపోవడం వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2.5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలను సాగుచేశారు. టమాట, కీరదోస, చిక్కుడు పంటలను వేయడం ద్వారా లాభాలు వస్తాయని ఆశించా. పంటచేతికి అందివచ్చే వరకే రూ 2లక్షల పెట్టుబడులు అయ్యాయి. సరైన ధరలు లేకపోవడంతో పాటు తెగుళ్లు ఎక్కువగా రావడంతో కూరగాయల రైతులు నష్టాలు చవిచూడవలసిన పరిస్థితిలు ఏర్పడ్డాయి.

తెగుళ్లను తొలిదశలో గుర్తిస్తేనే లాభాలు..

వాసాల గోవర్దన్, సిరిసిల్ల డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్



కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే లాభాలు గడించవచ్చు. టమాల, మిరప పంటలకు ఆకుమచ్చ తెగుళ్ల వస్తే మాంకోజేట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచాకారి చేయాలి. తామర పురుగులు ఆశిస్తే 2మీ.లీ డైమిథోయేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల బాధ తొలగిపోతుంది. రైతులు మారుతున్న పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పంటలను తెంపుకోవాలి.

కలెక్టర్ గళంలో 'ఓ చిన్ని పిచ్చుక' పాట



పాట పాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవనిలో అంతరిక్షంలో మగవారితో సమానం ఆడవారు. ఈనాటి కాలంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. అక్కడక్కడా నిరక్షరాస్యత, పేదరికం, ఆడవారిపై చిన్న చూపు వంటి కారణాలు అమ్మాయిల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగులుస్తున్నాయి. ఆడ పిల్లల మనుగడకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ దిశలో పుట్టుక నుంచి ఓ ఇంటి ఇల్లాలయ్యేవరకు ఆడపిల్లల సమస్యలను అర్థం చేసుకున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి మదిలో ఓ ఆలోచన మెరిసింది.

హిందీలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన పాటను తెలుగు లోకి అనువ దిస్తే సమాజంలో అవగా హన పెరుగుతుందని భావించారు. దీంతో ఖార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌ను పిలి పించుకొని తన అంతర్గత భావాన్ని ప్రస్తావించారు. ఆయన స్పందించి పాటను తెలుగులోకి అనువదించగా కలెక్టర్ స్వయంగా పాటను ఆలపించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాటను ఆవిష్కరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా..

● అందరి సలహాలు, సూచనల మేరకు పనులు
● 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
● దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్



రాజన్న ఆలయ పరిశరాలను పరిశీలిస్తున్న శైలజరామయ్యార్, ఆదిశ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీడీఏ వైస్‌చైర్మన్ కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బీగితే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు ఇతర ప్రముఖుల సలహాలు సూచనలు మేరకు చేపడుతున్నామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. మొదటి దశలో రూ.76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్న ప్రసాద వితరణశాల, రూ.47 కోట్లతో ప్రధాన రహ దారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలి పారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి విస్తరణ చేస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ పనులపై ప్రతి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రానున్నారని వెల్లడించారు. ఈ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్, ప్రచారరథంలో దర్శనం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీ డీఏ వైస్‌చైర్మన్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి.గితే ఆలయ ఈవో రమాదేవి ఉన్నారు.

నరసింహుడి హుండీ ఆదాయం 46.84 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా రూ.46,84,046 ఆదాయం లభించింది. గత జూన్ 26 నుంచి అక్టోబరు 15 వరకు గల హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 700 గ్రాముల మిశ్రమ వెండి, 26 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. బుధవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద రేవా ఉమ్మడి జిల్లా ఆధ్వ ర్యంలో రిటైర్డు ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో హకీంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని విమర్శించారు. పెన్షన్ బకాయిలు రాక పెళ్లిళ్లు చేయలేక, ఇల్లు కట్టుకోలేక అనారోగ్యంతో బాధపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరచారి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడాల లక్ష్మీ నారాయణ, కోశాధికారి కనపర్తి దివాకర్, ఐల్నేని నరేందర్‌రావు, వెంకట రమణ, నసీం అహ్మద్, కటకం ప్రభు, కరుణ శ్రీ, రాందాస్, వేణుగోపాల్, విమల, చంద్రమౌళి,చంద్రశేఖర్, దుబ్బయ్య, మదన్‌మోహన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక





నందకిషోర్, వాత్సల్య

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల పీడీలు తెలిపారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలకు చెందిన కట్ల నందకిషోర్ సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ టోర్న మెంటులో ప్రతిభ కన బర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలో ఈ నెల 16 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. గంగాధర మోడల్ స్కూల్‌కు చెందిన వాత్సల్య అండర్ 14 విభాగంలో పెద్దపల్లి జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగార్జున తెలిపారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అనుష్క రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీ లకు ఎంపికయింది. మంగళవారం కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య డిఫెన్స్ అకాడమిలో ఉమ్మడిజిల్లాల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో అనుష్క తన క్రీడాప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకుంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని కళాశాల స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సునీల్‌తోపాటు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల : మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో జి.యశశ్విని, జి.హారిక జగిత్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు, క్రీడల మండల కన్వీనర్ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.



అనుష్కను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పెద్దపల్లి రూరల్: మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదవుతున్న శ్రీజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈ సం దర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని శ్రీజను ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. అక్టోబరు 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో శ్రీజ అత్యంత ప్రతిభ కనబరిచి సంగా రెడ్డి పటాన్‌చెరువులో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కుంబాల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆనంది



జాతీయ స్థాయిలో మూడో స్థానంతో గుర్తింపు

కమాన్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 14న జరిగిన 40వ జాతీయ జూనియర్ చాంపియన్ షిప్ అండర్ 16 విభాగంలో నల్లవెల్లి ఆనంది మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ అందుకున్నది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లి శంకర్ భారతిల రెండో కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్నది. అలాగే ఆమె అథ్లెటిక్స్‌లో కొన్నేళ్లుగా తన ప్రతిభతో రాణిస్తూ పలు మెడల్స్ సాధించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో మరో సారి రాణించి మెడల్ సాధించడంపై లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ఆనంది కోచ్ సుబ్బారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సారంగపాణి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌లు బుధవారం ఆనందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆనంది పాల్గొంటున్న టోర్నీల్లో ప్రతిభతో మెడల్స్ సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అలాగే పలు మెడల్స్ అందుకొని, పుట్టిన ఊరుకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వాల్ పెయింటింగ్ పోటీలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మహిళలు, పిల్లలు దివ్యాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను తెలియజేసే విధంగా బుధవారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయ కాంపౌండ్‌పై మత్తు పదార్థాల వినియోగంతో కలిగే సమస్యలను పెయింటింగ్ ద్వారా వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్‌ఎంబీఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, మర్రి రాజేందర్ పోటీలను పర్యవేక్షించారు.

పదేళ్ల సేవలకు గుర్తింపు ఏది?

(7వ పేజీ తరువాయి)

అనుమతి ఇచ్చిన ఖాళీల్లో సీనియార్టీని గుర్తించి నియామకాల్లో అవకాశమివ్వాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు.

● 1,654 గెస్ట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి

- ఎన్.పూనమ్‌చందర్, హుజూరాబాద్

రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,654 గెస్ట్ లెక్చరర్ పోస్టులను తొలగించిన గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేయాలి. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలి. పదేళ్ళు అరకొర వేతనాలతో రెగ్యులర్ లెక్చరర్లకు సమానంగా విధులు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌కు తమవంతు కృషిచేశానమని, కనీసం ఇంటర్మీడియట్ బోర్డులోని ఖాళీ పోస్టుల్లోనైనా తమకు అవకాశం ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ మెంటార్‌గా తీగలగుట్టపల్లి ఉపాధ్యాయిని



అవార్డు అందుకుంటున్న తెలుగు ఉపాధ్యాయిని శ్రీదేవి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని సందుగుల శ్రీదేవి ఉత్తమ మెంటార్‌గా అవార్డు అందుకున్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మనక్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ మెంటార్ 2025 పురస్కారాన్ని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదేవిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఈవో భూపతి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న డిజిటల్ లెర్నింగ్ శిక్షణలో భాగంగా బుధవారం ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులను వాడకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొలంపల్లి ఆదర్శరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు వివిధ ప్రాం తాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య తెలిపారు. నగ రంలోని ప్రగతినగర్ ప్రాంతం, సాయి బాబా ఆలయం, మార్కండేయ పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ కరీంనగర్‌లో భాగంగా రహదారులపై ఉపయోగం లేని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు.టీఎస్ఎన్‌పీడీసీఎల్, మున్సిపల్ సిబ్బంది సహకారంతో చేపట్టినట్లు పేర్కొన్నారు. జూలైలో 72 స్తంభాలను హౌసింగ్ బోర్డు కాలనీలోని సబ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు బుధవారం 25 స్తంభాలను తరలించామన్నారు. డీఈ జంపాల రాజం, ఏడీఈ టౌన్-1 పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్-3 ఏఈ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే సంపూర్ణ జీవితానికి పునాది

రామడుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యమే వ్యక్తి సంపూర్ణ జీవితానికి పునాదులుగా నిలుస్తాయని సైకాలజిస్టు, అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గాలిపల్లి నాగేశ్వర్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రామడుగు మోడల్ స్కూల్‌లో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ (టీపీఏ) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే జీవితంలోని ప్రతి రంగంలో రాణించగలమన్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశం, రిటైర్డు ఎమ్మార్వో విశ్వముఖచారి, ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా రేడియాలజీ

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స(ఆపరేషన్) లేకుండా, నొప్పి లేకుండా వ్యాధి నయం చేయవచ్చని సోమాజిగూడ యశోద హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ హరీష్ తెలిపారు. బుధవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సర్జరీలకు సరైన ప్రత్యామ్నాయమన్నారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, మెదడు, గర్భాశయం, ఊపిరితిత్తులు మొదలైన అవయవాల్లోని తీవ్రమైన వ్యాధులకు చికిత్స చేయడంలో రేడియాలజీ సమవర్థవంతంగా పనిచేస్తుందన్నారు.బ్లాకైన నాళాలను తెరవడం, లీకైన నాళాలను మూసివేయడం, మెదడులో రక్తపుగడ్డలను తొలగించడం వంటి చికిత్సలు ఇంటర్వెన్షనల్ రేడియాలజీతో సులభంగా చేయవచ్చన్నారు.

ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా నగరంలోని కళాభారతిలో బుధవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. జీఎస్పీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో కవులు, రచయితలు, కళాకారుల సంఘాల వేదిక సహకారంతో కార్యక్రమం చేపట్టారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు మల్లేశం, సుమలత, సుమన్, సంధ్య, అంజిబాబు, అంజన్‌కుమార్, అంజలి, రాజేశ్‌గౌడ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

జమ్మికుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో యువత బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. బుధవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ముగ్గులు వేసి మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఎంసీ మల్లీశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీఎల్ ఆర్పీలు జ్యోతి, మంజుల ఉన్నారు.

ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్ల సమ్మె



ఆర్టీసీ టు డిపో ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

భగత్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపో ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్లు మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగారు. జేబీఎం సంస్థలో పనిచేసేందుకు చక్ర సంస్థ డ్రైవర్లను నియమించింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డ్రైవర్లు మెరుపు సమ్మెకు పూనుకున్నారు. దీంతో బస్సులు రాత్రి నుంచి నిలిచిపోయాయి. ఈ సందర్భంగా డ్రైవర్లు తమను శ్రమ దోపిడీ చేయడంతోపాటు, అనవసరంగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల వేతనాలు ఇవ్వక పోవటం, జీతాలు పెండింగ్‌లో ఉంచడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చక్ర మ్యాన్ పవర్ సంస్థ ప్రతినిధులు కరీంనగర్ వచ్చి బస్సు డ్రైవర్లతో సంప్రదింపులు జరిపారు. మధ్యాహ్నం నుంచి బస్సులు యథావిధిగా నడిచే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు పుల్లెల మల్లయ్య, ఎలక్ట్రికల్ బస్ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యపాల్, జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అమిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. చివరిరోజు ఉమ్మడి జిల్లా భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. ఉదయం రథోత్సవ, చూర్ణోత్సవ, వసంతోత్సవాలు, చక్రస్నానం నేత్రపర్వంగా కొనసాగాయి. సాయంత్రం ధ్వజావరోహణ, రాత్రి పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగిసాయి. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కో ఆర్డినేటర్‌గా తాజొద్దీన్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ కోర్డినేటర్‌గా డీసీసీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు మైనార్టీ సెల్ కో ఆర్డినేటర్ షకీల్ నవాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తాజొద్దీన్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో 101వ డివిజన్ బోరబండకు కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిందన్నారు.

అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నరేందర్‌రెడ్డికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగంలో 1991 నుంచి విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందిస్తున్నామని, ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ ప్రమాణాలు పాటిస్తూ విద్యానందిస్తున్నందుకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అత్యుత్తమ అవార్డు స్వీకరించడం గర్వంగా ఉందన్నారు. అవార్డును అబ్దుల్ కలాంకు అంకితమిస్తున్నట్లు చెప్పారు. అహర్నిశలు చేయూతనిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.

'మానేరు' అనంతరెడ్డికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అనంతరెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మానేరు విద్యాసంస్థల అధినేత, విద్యావేత్త కడారి అనంతరెడ్డికి అరుదైన పురస్కారం దక్కింది. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో లీడ్ ఇండియా ఫౌండేషన్, ట్రస్మా సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలోని పలువురు విద్యావేత్తలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఉత్తమ విద్యావేత్తల పురస్కారాలను ప్రదానం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 40 సంవత్సరాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి పురస్కారం అందుకున్నారు ఈ సందర్భంగా అనంతరెడ్డి విద్యా రంగంతోపాటు క్రీడారంగంలో సేవలందిస్తూ భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

● న్యూస్‌బాక్స్

యజ్ఞవరాహస్వామికి సారె

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యజ్ఞవరాహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భగత్‌నగర్, హెలీ ప్యాడ్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీవారికి, అమ్మవార్లకు సారె సమర్పించారు. మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు, మాజీ కార్పొరేటర్ జయశ్రీ పాల్గొన్నారు.

ఫ్రెషర్స్‌డే హంగామా

జమ్మికుంట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధ వారం నిర్వహించారు. డీఐఈవో గంగా ధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'అట్లనే' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవగడ్డ మిత్రుల పక్షాన శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 'చావడి' వేదికపై జిల్లాకు చెందిన కవి అన్నవరం దేవేందర్ 13వ కవితా సంపుటి 'అట్లనే' పుస్తకాన్ని ఆవి ష్కరించనున్నట్లు ఎలగందుల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, ప్రెస్ అకాడమి మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ, సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొననున్నట్లు తెలిపారు

పీహెచ్‌సీ తనిఖీ

రామడుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా మండలంలోని గుండి గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల నిల్వ, వినియోగ పద్ధతిని, పీహెచ్‌సీలో అవుట్ పేషెంట్స్ రిజిస్టర్ పరిశీలించారు. వైద్యాధికారి గ్రీష్మన్యా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

హుజూరాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన చినుమల్ల ప్రసాద్ కు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం పీవీ సేవ సమితి సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. నగదుతోపాటు నిత్యావసర వస్తువులను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య చేతుల మీదుగా అందజేశారు. పీవీ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు తూము వెంకటరెడ్డి, మనోజ్, జనార్ధన్ పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నుస్తులాపూర్‌లో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలన్నారు. జిల్లా సహాయ సంచాలకులు వినోద్‌కుమార్, ప్రత్యేకధికారి సురేందర్, పశువైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సైదాపూర్: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని వెన్కేపల్లిలో టీకాల కార్యక్రమాన్ని వైస్ చైర్మన్‌తో ప్రారంభించారు. 185 పశువులకు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సీహెచ్ విజేం దర్‌రావు తెలిపారు.

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రెండు గ్రామాల్లోని 145 గేదలకు టీకాలు వేసినట్టు అధికారులు తెలిపారు. పశువైద్యాధికారి శ్రీకాంత్, అభిలాష్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రముఖ న్యాయవాది కొరివి వేణుగోపాల్

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా బుధవారం దళిత జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖజురహో దేవాలయాల కేసు విచారణ సమయంలో ప్రధాన న్యాయమూర్తి గవాయి వ్యాఖ్యలను కొందరు వక్రీక రించారని ఆరోపించారు. దీనిపై వివరణ కూడా ఇచ్చారని తెలిపారు. కేసుకు సంబంధించి రాకేష్ కిషోర్ అనే న్యాయవాది ప్రధాన న్యాయ మూర్తిపై బూటు విసిరారని, ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. జేఏసీ నాయకులు కనకరాజు, చంద్రయ్య, విజయ్ కుమార్, రాజేందర్, రాజయ్య, లచ్చన్న, రాజేశ్వర్, విశ్వం, బాబుల్ వర్మ, సొల్లు బాబు, శుక్రుద్దీన్, రేణుక, సుదర్శన్, అంజయ్య పాల్గొన్నారు.

పాలకవర్గాలను నియమించండి



శుభాకాంక్షలు తెలుపుతున్న కొండూరు రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో నిలిచి పోయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను, జిల్లా బ్యాంకు పాలకవర్గాలను త్వరితగతిన పూర్తి స్థాయిలో నియమించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. బుధవారం వ్యవసాయశాఖ, రిజిస్టర్ ఆఫ్ కో ఆపరేటీవ్ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సురేంద్రమోహన్‌ను, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఓఎస్‌డీ, అడిషనల్ రిజిస్టర్ ఆఫ్ కో ఆపరేటివ్ జి.చంద్రమోహన్‌రెడ్డిని హైదరా బాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గాలు లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులు తొలిగేందుకు త్వరగా పాలకవర్గాలను నియమించాలని వినతి పత్రాలను అందజేశారు.

వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై మోదీ, బీజేపీ దేశవ్యాప్తంగా కుట్ర పన్నుతున్నట్లు మాల మహానాడు అండ్ రాక్స్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. బుధవారం హోటల్ తారకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ శాంపిల్‌గా దేశంలో మొదటిసారి పంజాబ్, హర్యానలో చేశారని, దానికి బీజంవేసింది కాంగ్రెస్ పార్టీ అని, దేశం మొత్తం చేసింది ప్రధాని మోదీ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేయగా దానిని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫాలో అయ్యిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణతో వందలో నలుగురికి మాత్రమే లబ్ధి చేకూరుతుందన్నారు. సమావేశంలో బల్లెం లక్ష్మణ్, కామన్ ప్రభాకర్‌రావు, మిరియాల బాలశౌరి, కొప్పుల ప్రేమ్‌బాబు, నెల్లి సూరిబాబు, కామా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఐఎంఏ ఉత్తమ అధ్యక్షుడిగా డాక్టర్ నరేష్



డాక్టర్ నరేష్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఐఎంఏ ఉత్తమ అధ్యక్షుడిగా డాక్టర్ ఎనమల్ల నరేష్ ఎంపికయ్యారు. 2024-25 సంవత్సరానికి నరేష్ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన హయాంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆల్‌రౌండ్ ఉత్తమ బ్రాంచ్‌గా కరీంనగర్ ఐఎంఏ ఎంపికైంది. ఈ అవార్డులను నవంబరు 2న కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో నిర్వహించే ఐఎంఏ 9వ రాష్ట్ర సదస్సులో అందుకోనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ తమ కార్యదర్శి డాక్టర్ నవీన్ కుమార్, ట్రెజరర్ డాక్టర్ విజయ్ కుమార్ సహకారంతో కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించగలిగామన్నారు.

ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్రస్థాయిలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేసేందుకు జాతీయస్థాయిలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. ఓసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 19న వరంగల్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం నగరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ సదస్సుకు రెడ్డి, వైశ్య, వెలమ, బ్రాహ్మణ, కమ్మ, మార్వాడి సామాజిక వర్గీయులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ఓసీలకు వర్తింపజేయాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో జనరల్ కేటగిరిలో కేటాయించిన స్థానాల్లో ఓసీలతోపాటు ఓసీయేతరులు పోటీ పడుతుండడంతో అవకాశాలు దక్కక నష్టపోతున్నారన్నారు. ఉమ్మడి జిల్లా, రాష్ట్ర ఓసీ సమాఖ్య నాయకులు వీరారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాజన్న, మైపాల్‌రెడ్డి, డాక్టర్ దీపక్‌బాబు, వి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి



నివాళులు అర్పిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని, మార్గదర్శకాలను పాటిస్తే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకుంటారని అన్నారు. రాష్ట్రపతిగా, ఇస్రో శాస్త్రవేత్తగా దేశానికి సేవలందించారని కొనియాడారు. కార్యమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: అబ్దుల్ కలాం జయంతిని నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో బుధవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగలసంతోష్‌రెడ్డి అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణం తెనుగువాడలోని ప్రాథమిక పాఠశాలలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగిశెట్టి జదీశ్వర్, హెచ్ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయులు భాస్కర్, దుర్గాజీ పాల్గొన్నారు.

బీఏఎస్ బకాయిలు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలను విడుదల చేయకపోతే ఆందళనలు ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ హెచ్చరించారు. బుధవారం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 180 కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయలను విడుదల చేయకపోతే విద్యార్థుల తల్లిదండులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్, నగర అధ్యక్షుడు పులిపాక సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక శ్రమతో రోగాలు దరిచేరవు



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శారీరకశ్రమ చేస్తే రోగాలు దరిచేరవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రునాయక్ అన్నారు. సింగాపూంర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో, చెల్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. జిల్లా శిక్షకులు డాక్టర్ వరుణ, డాక్టర్ తులసీ దాస్, చెల్పూర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మధుకర్, వైద్యులు డాక్టర్ జాన్సన్, వీరునాయక్, కీర్తన ఉన్నారు.

గణేశ్‌నగర్: సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ ప్రణవ్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు స్వరూప, డాక్టర్ మొగిలి, డా లక్ష్మణ్ రావు, డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో బుధవారం సీపీఆర్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడ వచ్చన్నారు. జిల్లా శిక్షకులు డాక్టర్ వరుణ, డాక్టర్ తులసీ దాసు, డాక్టర్ మధుకర్, ఆరోగ్య బోధకులు పంజాల ప్రతాప్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, డైరెక్టర్లు రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.